క్లుప్తంగా

భ్రమరాంబిక అమ్మవారికి విశేష పూజలు



గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని గంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామి వారు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రొఫెసర్ స్వామి నాథన్ గొప్ప శాస్త్రవేత్త



లక్ష్మీపురం: ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ గొప్ప శాస్త్రవేత్త అని, భారత ముద్దు బిడ్డ అని ప్రజలకు సేవ చేయటానికి స్వామినాథన్ సైన్స్‌ను ఒక సాధనంగా ఉపయోగించారని సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం పేర్కొన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శతజయంతి సభ శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ భద్రతకు కీలకమైన వ్యవసాయరంగాన్ని ప్రభావితం చేసిన వారిలో ప్రొఫెసర్ స్వామినాథన్ ఒకరన్నారు. స్వామినాథన్‌ను హరిత విప్లవ పితామహుడిగా పేర్కొంటారని స్వామినాథన్ తన 98 ఏళ్ల జీవితంలో అనేక వైవిధ్యమైన విజయాలను అందుకున్నారన్నారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండాశి వరామిరెడ్డి మాట్లాడారు.

రోగులకు పండ్లు పంపిణీ




గుంటూరు మెడికల్: పేషెంట్ డాక్టర్ ఇంటరాక్షన్ కార్యక్రమంలో భాగంగా 25వ శుక్రవారం మీ కోసం– మేము కార్యక్రమం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవ దానంతో లాభాలు వివరించారు. జీజీహెచ్‌లో నూతన సెక్యూరిటీ పాలసీ ప్రకారం అటెండర్ పాస్ తప్పనిసరి, అవసరం మేరకు మాత్రమే రోగి బంధువులు ఆస్పత్రిలో ఉండాలన్నారు. మత్తు పానీయాలు తీసుకొని ఆస్పత్రి లోపలికి రావద్దని సూచించారు. నిర్దేశించిన ఆస్పత్రి నియమావళి గురించి ప్రజలకు అవగాహన కలిగించారు. జాగృతి సేవా సంస్థ నాగరాజ కుమారి రోగులు, రోగుల సహాయకులకు ఉచితంగా పండ్లు పంపిణీ చేశారు.

విద్యార్థిని చేతిలో సెల్‌ఫోన్ లాక్కొని పరారైన దుండగుడు

పట్నంబజారు: విద్యార్థిని చేతిలో సెల్‌ఫోన్ లాక్కొని పరారైన ఘటన ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. విజయవాడకు చెందిన షేక్ షమ్మి సత్తెనపల్లి వద్ద కంటిపూడి వద్ద నలందా కళాశాలలో ఫార్మా – డీ చదువుతోంది. శుక్రవారం సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌లో దిగి విజయవాడ సెక్టార్‌లో బస్సు ఎక్కేందుకు ఫోన్ మాట్లాడుతుండగా, గుర్తు తెలియని యువకుడు ఆమెను బెదిరించి సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు పాతగుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠం



నెహ్రూనగర్: అప్పుడే పుట్టిన పిల్లలకు గంటలోపు ముర్రుపాలు పట్టించడం ఎంతో శ్రేష్ఠమని.. తద్వారా తల్లికి, పిల్లలకు అనుబంధం పెరుగుతుందని డాక్టర్ శ్రీధర్ తెలిపారు. గుంటూరు అర్బన్ ఈస్ట్ 1 సెక్టార్ పరిధిలోని ఇజ్రాయేల్‌పేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

యువతి అదృశ్యం

లక్ష్మీపురం: గుంటూరు మహిళా ప్రాంగణంలో ఓ యువతి అదృశ్యం కావడంతో నగరంపాలెం పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. జూన్ 10వ తేదీన అరండల్ పేట పోలీసులు గుంజి.కల్పన అనే యువతిని మహిళా ప్రాంగణంలోని శక్తిసదన్‌లో చేర్పించారు. ఈ నెల నాలుగో తేదీన మహిళా ప్రాంగణంలో తోట శుభ్రం చేస్తుండగా, సాయంత్రం ఐదు గంటల నుంచి కల్పన కనిపించలేదు. ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేసి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో శుక్రవారం రాత్రి మహిళా ప్రాంగణం సిబ్బంది సుకన్య నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే





శ్రావణ శుక్రవారం వరలక్ష్మీవ్రతం సందర్భంగా ఆలయాలు పోటెత్తాయి. భక్తి శ్రద్ధలతో మహిళలు ఆలయాలు దర్శించి అమ్మవారి అనుగ్రహం కోసం విశేష పూజలు నిర్వహించారు . శ్రావణ శుక్రవారం రోజున వరలక్ష్మీ దేవిని పూజిస్తే అష్టైశ్వర్యాలైన సంపద, భూమి, కీర్తి, శాంతి, సంతోషం , శక్తి వంటివి లభిస్తాయని, వివాహితులు తమ భర్తల సౌభాగ్యం కోసం అమ్మవారు దీవెనలందిస్తారని భక్తుల విశ్వాసం. –సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు





భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమార్చనలు



సిద్ధార్థ నగర్‌లోని కనకమహాలక్ష్మీ మందిరంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



మల్లారెడ్డినగర్ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో వరలక్ష్మిగా..



బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో..



అరండల్‌పేట శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో..

నగరంపాలెం: గుంటూరు నగర, శివార్లల్లోని దేవాలయాల్లో శుక్రవారం శ్రావణ శుక్రవారం వరలక్ష్మీవ్రతాలు వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున్న తరలి వచ్చారు. శ్రీస్వామి వార్లను, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

బృందావన్‌గార్డెన్స్‌లో..

స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీపద్మావతి కల్యాణ మండపంపై పాలకమండలి ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు మాధవస్వామి బృందం వందలాది మంది సువాసినులతో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. స్థానిక అరండల్‌పేట శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మర్రిపాటి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో సువాసినులతో కోటి కుంకుమార్చన అమ్మవారికి విశేష అభిషేకార్చనలు, 1,108 బంగారు కలువపూల పూజ భక్తి శ్రద్ధలతో చేపట్టారు. మంత్రపుష్పం తీర్థ, అన్నప్రసాద వితరణ చేశారు. సిద్ధార్థనగర్.. 11వ వీధిలోని శ్రీకనకమహాలక్ష్మీ మందిరంలో మహాలక్ష్మీ అమ్మవారిని వరలక్ష్మీ అమ్మవారిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు ఘంటసాల విజయకుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రూ.15 లక్షలతో అలంకారం..

మల్లారెడ్డినగర్ శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో పర్వతవర్ధిని అమ్మవారిని వరలక్ష్మీ అమ్మవారిగా అలంకరించారు. సుమారు రూ.15 లక్షల నగదుతో అమ్మవారిని అలకరించి, విశేష పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కమిటీ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో..

ఆర్.అగ్రహారం కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతం కనుల పండువగా నిర్వహించారు. పరమపూజ్య వైశ్యకుల గురువు శ్రీవామనాశ్రమం మహాస్వామీజీ ఆధ్వర్యంలో కుంకుమ పూజ వైభవంగా జరిగింది. వందలాది మహిళలు హాజరై, అమ్మవారికి విశేష పూజలు చేశారు. వామనాశ్రమ స్వామీజీ మాట్లాడుతూ అమ్మవారిని పూజించడం వల్ల అమ్మవారు భక్తులను అన్నివేళల కాపాడుతుందని అన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శి గుడివాడ రవికుమార్, కోట శేషగిరి, కోశాధికారి పాపా రావు పాల్గొన్నారు.

మారుతీ దేవాలయంలో..

స్థానిక మారుతీనగర్ శ్రీకంచి కామకోటి పీఠం మారుతి దేవాలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. వందలాది మాతృమూర్తులు వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించగా, వాయనాలు పరస్పరం సమర్పించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించగా, ఆలయ కమిటి కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



మారుతీనగర్ శ్రీకంచి కామకోటి పీఠంలో..



ఆర్.అగ్రహారం కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతం

భక్తిశ్రద్ధలతో చండీహోమం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ శుక్రవారం చండీహోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులతో తొమ్మిది మంది వేదపండితులు గణపతికి, శివ లింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీగణపతి, చండీ హోమాలు నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి వైభవంపై ప్రవచనం

అన్నమయ్య కళావేదికపై శ్రావణ శుక్రవారం సందర్భంగా లక్ష్మీదేవి వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ పాలకవర్గం నిర్వాహకులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగ నాయకి మాట్లాడుతూ శ్రావణ శుక్రవారం రోజున నిర్వహించే వరలక్ష్మీ వ్రతం, హిందూ సంప్రదాయంలో స్త్రీలకు ఎంతో ముఖ్యమైన పండుగని అన్నారు.



ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు

పట్నంబజారు: శంకర్‌విలాస్ ఓవర్ బ్రిడ్జి పనుల నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా బాధ్యతతో వ్యవహరించాలని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్ సిబ్బందిని సూచించారు. శుక్రవారం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ అశోక్ మాట్లాడుతూ శంకర్‌విలాస్ ఓవర్ బ్రిడ్జి పనులు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో బ్రిడ్జి కూలిస్తే ఈస్ట్ పరిధిలో ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ప్రధానంగా రాధాకృష్ణ థియేటర్ సెంటర్, భగత్‌సింగ్ బొమ్మ సెంటర్, నెహ్రూనగర్ రైల్వే గేటు, సంజీవయ్యనగర్ రైల్వే గేటు, ఆర్టీసీ బస్టాండ్, 60 అడుగుల రోడ్డు, అన్నా శ్రీనివాస కళ్యాణ మండపం రోడ్డు, ఓల్డ్ క్లబ్ రోడ్డు, ఉమెన్స్ కాలేజ్ రోడ్డు, రైల్వేస్టేషన్, నాజ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపుల్లో భాగంగా ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉందని వివరించారు. ఈనేపథ్యంలో ప్రధాన పాయింట్లలో సిబ్బంది కేటాయించి విధులు నిర్వర్తించేలా దృష్టి సారించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐలు రవీంద్ర, విజయకుమార్‌రెడ్డి పల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అశోక్

రామాయణం అంతటా సౌభ్రాతృత్వం



నగరంపాలెం: స్థానిక ఏటీఅగ్రహారం శ్రీ కంచి కామకోటి పీఠ శంకర, గాయత్రీ, దత్త సాయి, సత్యదేవ మందిరం(గాయత్రీ మాతా మందిరం)లో సంస్కృత భారతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంస్కృత సప్తాహం శుక్రవారం మూడో రోజుకు చేరింది. మహిళాప్రముఖ్ డాక్టర్ జన్నాభట్ల ఉమా మాట్లాడుతూ సంస్కృతం జన భాష చేసేందుకు సంస్కృత భారతీ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. రామాయణం– సౌభ్రాత్రంపై డాక్టర్ బాపట్ల ఫణికామేశ్వరి మాట్లాడారు. డాక్టర్ పెసల దేవేంద్రగుప్త, కిడాంబి దేవరాజన్, జి.రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

బతుకుపోరు చిత్రం 'అల్లిక'

- ప్రసిద్ధ రచయిత్రి చల్లపల్లి స్వరూపరాణి కవితా సంపుటి
- నేడు తెనాలిలో పరిచయ సభ

తెనాలి: సంక్షుభితమైన జీవితాలు, చీకటి బతుకుల్లోని సంకెళ్లను ఛేదించుకుని పోరాట యోధులుగా వెలిగిన అరుదైన స్త్రీల చరిత్రను 'మిణుగురులు'గా రికార్డుచేసిన ప్రముఖ కవయిత్రి చల్లపల్లి స్వరూపరాణి తాజా కవితా సంపుటి 'అల్లిక'. స్థానిక కవిరాజు పార్కులోని వీజీకే భవన్‌లో శనివారం సాయంత్రం ఆరు గంటలకు జరగనున్న ఈ పుస్తక పరిచయ సభకు కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహించనున్నారు. 'అరసం' జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, వివిధ సాహిత్య సంస్థల బాధ్యులు నూకతోటి రవికుమార్, ఉన్నవ వినయ్‌కుమార్, శిఖా ఆకాష్, డాక్టర్ మిరప మాధవి, తంగిరాల సోని పాల్గొంటారు. తాను అనుభవించిందీ, అనుభవానికి వచ్చిందీ రాయలేనితనం నుంచి పుట్టుకొచ్చిన కవితలే 'అల్లిక' కవితా సంపుటిలో చోటుచేసుకున్నాయని స్వరూపరాణి చెబుతారు. ప్రపంచవ్యాప్తంగా రైట్‌వింగ్ ఫాసిస్టు శక్తుల విజృంభణతో అణచివేతకు గురయ్యే సమూహాలు, ముఖ్యంగా నల్లజాతివారు, ఆదివాసులు, మైనారిటీ మతస్తులు, స్త్రీల గొంతుమీద వేటగాడి కత్తి వేలాడుతున్న సందర్భం... కులమత తత్వాలకు కోవిడ్ తోడై పీడిత ప్రజలకు ఊపిరాడకుండా చేయటం, రకరకాలైన అమానవీయతపై స్వరూపరాణి కలం నుంచి గత ఏడేళ్లలో వెలువడిన కవితలివి. గత కవిత్వం కన్నా భిన్నమైన, గాఢమైన, తీవ్రమైన దళిత అభివ్యక్తి ఇందులో ఉంది. సమాజంపై తన దళిత దృష్టీ, బహుజన సోయా ఏమాత్రం వన్నె తగ్గకపోగా సరికొత్త నాణ్యతనీ, లోతునీ సంతరించుకున్న కవితా సంవాదం 'అల్లిక'లో నిర్మితమయిందన్న ప్రశంసలు అందుకున్నారు కవయిత్రి. ఆర్కియాలజీ, సామాజిక, సాంస్కృతిక చరిత్ర, ఎథ్నో ఆర్కియాలజీ, జెండర్ స్టడీస్, రెలిజియస్ స్టడీస్‌లు స్వరూపరాణి పరిశోధనా రంగాలు. మూడు కవితా సంపుటాలు వెలువరించారు. ఇందులో ఒకటి ఇంగ్లిష్. 'మంకెనపువ్వు' కవితా సంపుటి తెలుగు కవిత్వంలో మంచి గుర్తింపు పొందారు. 'స్టాలిన్ గ్రాడ్లో దళిత పులులు' పేరున తొలితరం దళిత కమ్యూనిస్టుల చరిత్రను వెలికితీశారు. రెండు వ్యాస సంపుటాలు, అయిదు సిద్ధాంత గ్రంథాలు ప్రచురించారు. వీరి రచనలు ఇంటర్ నుంచి పీజీ వరకు పలు విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా ఉన్నాయి. వృత్తి, వ్యావృత్తుల్లో భాగంగా వందలాది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సమావేశాల్లో ప్రసంగాలు చేశారు. వందకు పైగా పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బెస్ట్ రీసెర్చర్ అవార్డును ఇచ్చారు. ఈమె వద్ద 60 మంది పరిశోధక విద్యార్థులు పీహెచ్‌డీ చేశారు. వీరిలో ఎక్కువ మంది బర్మా, థాయ్‌లాండ్, వియత్నాం, భూటాన్‌కు చెందిన వారు. తన కృషికి గుర్తింపుగా 13 అవార్డులు స్వీకరించారు.



ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి

పేదల రక్తం పీలుస్తున్న చంద్రబాబు

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా

పట్నంబజారు: పేద ప్రజలకు హామీలు ఇచ్చి అవి అమలు చేయకుండా వారి రక్తం పీలుస్తున్న దుర్మార్గుడు చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని 57వ డివిజన్‌లో శుక్రవారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. నూరిఫాతిమా మాట్లాడుతూ పేద ప్రజలను నిలువునా వంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతోందన్నారు. కూటమి సర్కార్ పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని ఆందోళన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు పక్కనపెట్టి, వైఎస్సార్ సీపీ నేతలపై కక్ష సాధించేందుకే పాలన సాగిస్తున్నారని మండి పడ్డారు. చివరకు రీ ఎలక్షన్‌లో గెలుపుకోసం నీచ రాజకీయాలు చేస్తూ ప్రజాప్రతినిధులపై దాడికి తెగబడడం సిగ్గుచేటని చెప్పారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఉన్న అభిమానాన్ని ఆపలేరన్నారు. కూటమి సర్కార్ పాలనకు రానున్న రోజుల్లో మంగళం పాడడం తథ్యమని హెచ్చరించారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నూరిఫాతిమా

రెడ్‌బుక్ పాలనలో దారుణాలు

పట్నంబజారు: రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనలో దారుణాలు చోటుచేసుకుంటున్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మండిపడ్డారు. గుంటూరు నగరంలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో భాగంగా బీసీ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి చేసి, గాయపరచటం సిగ్గుచేటన్నారు. న్యాయబద్ధంగా ఎన్నికల్లో గెలవాలి కానీ.. ఇటువంటి భౌతిక దాడులు చేసి, ప్రజలను భయపెట్టాలని చూస్తే.. ఏ ఒక్కరూ భయపడరన్నారు. భారత రాజ్యాంగాన్ని పక్కన పెట్టి.. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల్లో గుండెల్లో కొలువైన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని నందిగామలో ఉద్దేశపూర్వకంగా మున్సిపల్ అధికారులతో తొలగించటం సిగ్గుచేటన్నారు. కేవలం కక్షపూరితంగానే మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించారన్నారు. అర్ధరాత్రి పూట విగ్రహాన్ని అక్రమంగా తొలగించినా.. ప్రజల్లో మనస్సుల్లో ఆయన చేసిన మేలును, వైఎస్సార్ పేరును చెరపలేరన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఇటువంటి నీచ కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కచ్చితంగా రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



మస్తాన్‌వలి

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అరండల్ పేట, వసంతరాయపురం, మల్లికార్జున పేట, శ్రీనగర్, అమరావతి రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులు సమర్థంగా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ప్రతి పని నిర్దేశిత గడువు మేరకు పూర్తి అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, జాప్యం జరిగితే ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. ఏఈల వారీగా రోడ్లపై ప్యాచ్ వర్క్‌లను చేపట్టాలని, ప్రతి రోజు తాగునీటి సరఫరా జరిగే సమయంలో ఎమినిటీ కార్యదర్శులు తప్పనిసరిగా శ్యాంపిల్స్ తీసి ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. అనంతరం అమరావతి రోడ్‌లో ఆక్రమణలను గమనించి, శంకర్ విలాస్ వంతెన పనులతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నందున రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణల తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచించారు.



పనుల రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

అంతరిక్ష ప్రగతికి విక్రమ్ సారాబాయ్ కృషి మరువలేనిది

గుంటూరు ఎడ్యుకేషన్: అంతరిక్ష పరిశోధన, ప్రయోగాల్లో భారతదేశం సాధించనున్న ప్రగతిని ముందుగానే ఊహించిన విక్రమ్ సారాబాయ్ పటిష్టమైన ప్రణాళికలు రూపొందించినట్లు ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త వినోద్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భారత అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ అంబాలాల్ సారాబాయ్ 106వ జయంతి వారోత్సవాల్లో భాగంగా శనివారం డెవలపింగ్ లాంచింగ్ సెంటర్ ఫర్ రాకెట్ అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వినోద్ శ్రీవాత్సవ మాట్లాడుతూ దేశభక్తి గల సారాబాయి భారతదేశ భవిష్యత్‌ను ముందుగానే గుర్తించి, తిరునంతపురంలోని తుంబాలో ఏర్పాటు చేసిన అంతరిక్ష పరిశోధన కేంద్రం తరువాతి కాలంలో ఇస్రోగా ఆవిర్భవించిందన్నారు. 1963 నవంబర్ 21న సౌండింగ్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించారని, దానిని లాంచింగ్ స్టేషన్‌కు ఒక సైకిల్‌పై తీసుకువెళ్లారని వివరించారు. 1967లో ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో విక్రమ్ సారాబాయ్ ఆధ్వర్యంలో రోహిణి రాకెట్ ను విజయవంతంగా ప్రయోగించారని, భారత అంతరిక్ష రంగంలో నాటి రోహిణి నుంచి ఇటీవల ప్రయోగించిన నైసర్ వరకు అంతరిక్ష ప్రయోగాల విజయ పరంపర కొనసాగుతూనే ఉందన్నారు. కార్యక్రమంలో చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ డైమండ్స్ షోరూంలో ఆర్టిస్ట్రీ షో ప్రారంభం

నగరంపాలెం: అత్యధిక డిజైన్లతో ప్రారంభించిన ఆర్టిస్ట్రీ షో ఎంతో ఆకర్షణీయంగా ఉందని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో ఆర్ట్ ఇన్ ఎవ్రీ జ్యువెల్ అనే ఆర్టిస్ట్రీషో ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే గళ్లా మాధవి, ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ టి.మహతి, పెద్ది రమణారావు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యుత్తమ బంగారు వజ్రాభరణాల వ్యాపార సంస్థల్లో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జ్యూవెలరీ ఒకటని అన్నారు. వ్యాపార రంగంతో పాటు సేవా రంగంలో అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ ఆఫర్లను కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈనెల 8 నుంచి 11 వరకు ఆర్టిస్ట్రీ షో కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్టోర్ హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపికిరణ్ పాల్గొన్నారు.



షోను ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్లా మాధవి

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నగరంపాలెం: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీ–9సెక్షన్ ఏఈ ఎం.రవికుమార్, టౌన్–4 డెప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ పి.హెచ్.ఖాన్ శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. నగరంలోని కాకామానువారితోట, ఉపకేంద్రం, ఆటోనగర్ కేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. కాకుమానువారితోట, వల్లూరువారితోట, మాలకొండయ్యకాలనీ, వసంతరాయపురం, సంజీవయ్యనగర్, ఆటోనగర్ ఫేజ్–3,4 ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు. శ్యామలానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యా హ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 డీఈఈ గురువయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సాయినగర్, శ్యామలానగర్, స్తంభాలగరువులో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. 33 కేవీ ఆర్టీసీ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు టీ–4 డీఈఈ పీహెచ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. యానాదికాలనీ, దుర్గానగర్, గొలుసు కొండలరావునగర్, సత్యనారాయణ స్వామి వీధి, యాదవబజారు, బాలాజీనగర్, కొండయ్యకాలనీ, ఎల్‌బీ నగర్, వినోభనగర్, మారుతీనగర్, జాకిర్‌హుస్సేన్‌నగర్, క్రిస్టియన్‌పేట, శివాలయం గుడి, బీఆర్‌స్టేడియం ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

